నరసాపురంలో అభివృద్ధి పరుగులు

- రూ.3.37 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- ఇప్పటికే పూర్తయిన పలు పనులు
- చురుగ్గా సాగుతున్న పెండింగ్ వర్కులు



నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. పట్టణ వాసులకు అన్ని సౌకర్యాలూ కల్పించేందుకు కృషి చేస్తున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పలు ప్రధాన రహదారులు, డ్రెయిన్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వేసవి సమీపించడం, పనులకు అనుకూలం కావడంతో పెండింగ్ పనులపైనా అధికారులు దృష్టిపెట్టారు. ఈ పనులు మే చివరినాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. కీలకమైన ప్రాంతాలు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రెయిన్లకు కొత్తరూపు వచ్చినట్టైంది. ముఖ్యంగా మున్సిపాలిటీలో ఇటీవల జనరల్ ఫండ్స్ పెద్ద ఎత్తున ఖర్చుచేస్తూ అభివృద్ధి చేస్తున్నారు. తాజాగా 14వ ఆర్థిక సంఘం నిధులతో వేసవిలో పూర్తిగా రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని నిర్ణయించారు. టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టారు. స్టేషన్‌పేట, గ్రేస్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో రోడ్లు శిథిలమవ్వడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో కొన్నిచోట్ల డ్రెయిన్లు కూడా శిథిలమయ్యాయి. దీంతో 14వ ఆర్థిక సంఘం నిధులతో ఈ ప్రాంతాల్లో పనులు చేపట్టారు.


స్టేషన్‌పేట వద్ద రైల్వేస్టేషన్ సమీపంలో రూ.1.05 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు, కెనాల్ సపోర్టింగ్ వాల్

రూ.3.37 కోట్లుతో అభివృద్ధి పనులు

మొత్తం రూ.3.37 కోట్లు 14వ ఆర్థిక సంఘం నిధులతో గతేడాది మార్చి నెలలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం స్టేషన్‌పేట ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వెనుక చినమామిడిపల్లి మీదుగా రైల్వేగేట్ సమస్యకు పరిష్కారంగా బైపాస్ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు ఈ బైపాస్‌రోడ్డుకు అనుసంధానంగా స్టేషన్‌పేటలో ఉన్న రోడ్డును 14వ ఆర్థిక సంఘం నిధులతో పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా అభివృద్ధి చేశారు. రూ.1.05 కోట్లుతో సీసీ రోడ్డు, కెనాల్ పక్కన సపోర్టింగ్ వాల్ నిర్మించారు. దీంతో ఇటుగా సుమారు 30 గ్రామాల వారు ప్రయాణిస్తారు. వీరందరికీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగంగా మారడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. స్టేషన్‌పేట నుంచి గ్రేస్ నగర్ వరకు రూ.30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. 22వ వార్డులో రూ.42 లక్షలతో సీసీ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు, వైఎస్సార్ నగర్‌లో రూ.48 లక్షలతో సీసీ రోడ్డు, 2వ వార్డులో రూ.28 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్, 10వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్, 1వ వార్డు శ్రీహరిపేటలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



పట్టణంలోని చాలా కాలంగా రోడ్లు, డ్రెయిన్లు శిథిలమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఆర్థిక సంఘం నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించాం. చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సూచనలతో అభివృద్ధే ధ్యేయంగా, ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

టీడీపీ - జనసేన సభ అట్టర్‌ఫ్లాప్


చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: టీడీపీ, జనసేన పార్టీలు అనైతిక పొత్తుపెట్టుకుని తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ బుధవారం పాలకొల్లులో ఒక ప్రకటనలో విమర్శించారు. సభకు కనీసం 20 వేల మందిని కూడా సమీకరించలేదని పేర్కొన్నారు. ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చంద్రబాబు మోసగాడు, ఏపీని సర్వనాశనం చేశారని విమర్శించిన పవన్ కల్యాణ్ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు విలువ లున్న వ్యక్తిని పొగుడుతూ ప్రసంగాలు చేయడాన్ని ప్రజలు విశ్వసించడం లేదని వివరించారు. వీరిద్దరు బీజేపీని కూడా కలుపుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకి గతంలో 23 సీట్లు వచ్చాయని, ఈ సారి మూడు సీట్లు కూడా గెలవలేరని, పవన్‌కల్యాణ్ ఒక్క సీటు కూడా గెలవలేరని తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనేదీ ప్రశ్నగా మారిందని పేర్కొన్నారు. ఏదేమైనా 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వీప్ చేయనున్నారని వివరించారు. టీడీపీ, జనసేనలకు ఇవి చివరి ఎన్నికలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి


కోమటితిప్పలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఏఈ ఫణీంద్ర

మొగల్తూరు: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ఫణీంద్ర సూచించారు. బుధవారం మొగల్తూరు మండలం కోమటితిప్ప గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఆయన పర్యటించారు. గ్రామంలో మంజూరైన 17 ఇళ్లకు 14 నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలిన 3 ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

ఘనంగా టైలరింగ్ దినోత్సవం


మొగల్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

మొగల్తూరు: దర్జీలను ప్రభుత్వం అన్ని విదాలా ఆదుకోవాలని టైలర్లు కోరారు. ప్రపంచ టైలరింగ్ దినోత్సవం సందర్భంగా బుధవారం మొగల్తూరు బాపూజీ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లా శ్రీరామ చంద్రమూర్తి, నంబాల రమేష్, పడవల నారాయణ, షరాబ్ సూర్యనారాయణ, పిట్లా శాంతారావు, సురేష్, బొక్కా రాజేశ్వరరావు, బొల్లా కృష్ణ,కవురు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ భవనం ప్రారంభం


ప్రారంభమైన నూతన భవనం

పాలకొల్లు సెంట్రల్: విద్యా దాతల సహకారం ఉంటే విద్యార్థులు మరింత ఉన్నత చదువులు చదువుకోవడానికి ఎంతో సహకారంగా ఉంటుందని చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు అన్నారు. బుధవారం స్థానిక చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటుచేసి 50 ఏళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా దాతల సహకారంతో నిర్మాణం చేసిన స్వర్ణోత్సవ భవనం అదనపు తరగతి గదులు భవనాన్ని ప్రారంభించారు. నరసింహరావు మాట్లాడుతూ దాతలు అల్లూరి విజయలక్ష్మి, కలిదిండి జయలక్ష్మి, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, అల్లూరి సీతారామరాజు, కలిదిండి రామరాజు, చుండూరి వెంకట నారాయణరావులతో పాటు మరింత మంది దాతలతో ఆరు బ్లాక్‌లుగా 12 రూంలు నిర్మించామని, ఈ భవనాన్ని ఇంటర్ విద్యార్థులకు నియమించనున్నామని వివరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, ఛాంబర్స్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన


మార్టేరులో ప్రతిష్ఠించిన వెంకటేశ్వరస్వామి విగ్రహం

పెనుమంట్ర: మార్టేరులో పునర్నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను దాతలు ఘనంగా నిర్వహించారు. దాతల సాయం రూ.60 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వెలగల చైతన్య ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో పూజ చేస్తున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

మొగల్తూరు: మండలంలోని కేపీపాలెం నార్త్ గ్రామంలో బుధవారం కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ డీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యులు పీడీ రాజు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, దొంగ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి


అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అనుపమ

పాలకొల్లు అర్బన్: మార్చి 3న నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం అనుపమ అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్చి 2న నుంచి 5వ తేదీ వరకు నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరా 24 గంటలూ ఉండేలా విద్యుత్ శాఖ ఏఈలు చర్యలు తీసుకోవాలన్నారు. పోలియో బూత్ వద్ద మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 35 బూత్‌లు ఏర్పాటు చేసి 3,535 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. యలమంచిలి, మేడపాడు మెడికల్ ఆఫీసర్లు ఎస్ భారతి, విన్స్వరూప్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ రవిరాజ్, ఎలక్ట్రికల్ ఏఈ వై.నారాయణరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మంగ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కమిషనర్‌గా విజయ పార్థసారథి



పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మునిసిపల్ కమిషనర్‌గా విజయ పార్థసారథి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల జిల్లా చీరాల మునిసిపల్ కార్యాలయం నుంచి పాలకొల్లు బదిలీపై వచ్చారు. 1992 బ్యాచ్‌కు చెందిన పార్థసారథి తెనాలిలో మొదటిగా బాధ్యతలు స్వీకరించారు. పొన్నూరు, తాడేపల్లి, మంగళగిరి, రేపల్లి, చీరాల మునిసిపాల్టీల్లో పనిచేశారు. నరసాపురం పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని పార్థసారథి తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని అన్నారు. ముందుగా మునిసిపల్ కార్యాలయ సిబ్బంది పార్థసారథికి శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకరమణ అన్నారు. బుధవారం నరసాపురం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మున్సిపాలిటీలో శానిటేషన్ అధ్వానంగా ఉంటుందని ధ్వజమెత్తారు. పారిశుధ్య కార్మికులు రికార్డుల్లో చూపిస్తున్నంత మంది హాజరు కావడంలేదన్నారు. కౌన్సిలర్లు షకినేటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, కోటిపల్లి సురేష్‌లు శానిటేషన్‌పై ప్రశ్నించారు. దీనికి చైర్‌పర్సన్ సమాధానమిచ్చారు. వీధి దీపాల నిర్వహణపై సభ్యులు అడిదల శ్యామల, కావలి రామసీత ప్రశ్నించారు. మున్సిపల్ షాపులు అద్దెకు పాడుకుని, వారికి సకాలంలో షాపులు అందివ్వని కారణంగా వారు చెల్లించిన డిపాజిట్లు తిరిగి వెనక్కి ఇచ్చేయాలని తీర్మానం చేశారు. పలువురు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సమాధానం ఇచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వంగా శ్రీకాంత్ కన్నా, వైకేఎస్, మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ, షేక్ అబేధాసుల్తానా, వన్నెంరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


శేరేపాలెంలో ఉపాధి పనుల మస్తర్‌ను పరిశీలిస్తున్న జేఈ ఆనంద్

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరందించేందుకు పంట బోదెల్లో నిలిచిపోయిన మట్టిని, ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. బుధవారం మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం జేఈ వి.ఆనంద్ పంట బోదె తవ్వకం పనులు, మస్తర్‌ను పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలు అందజేశారు.

టీడీపీ కుళ్లు రాజకీయాలు సిగ్గుచేటు

పోడూరు: టీడీపీ కుళ్లు రాజకీయాలు సిగ్గుచేటని తూర్పుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇటీవల తూర్పుపాలెంలో 50 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు ప్రకటించడాన్ని వైఎస్సార్ సీపీ ఆ గ్రామ నాయకులు గుబ్బల శ్రీనివాస్, ఇర్రింకి శ్రీనివాస్, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గొట్టుముక్కల ఏసురత్నం, మేడిచర్ల పండు, దిగమర్తి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. టీడీపీ కండువాలు వేసుకున్నవారిలో వైఎస్సార్ సీపీ నాయకుల్లేరని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో తూర్పుపాలెం గ్రామం నిర్లక్ష్యానికి గురైందని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వచ్చాక గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. తమ గ్రామంలోనే నివాసాన్ని, కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ఆచంట నియోజకవర్గంలోనూ, జిల్లాలోనూ తూర్పుపాలెం గ్రామానికి చరిత్రాత్మకంగా ప్రత్యేక వన్నె తెచ్చిన ఘనత ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజుకే దక్కుతుందని కొనియాడారు. తూర్పుపాలెం అభివృద్ధి, పేరు ప్రఖ్యాతులు చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు కుళ్లు రాజకీయాలకు తెరలేపుతున్నారని, ఇటువంటి సిగ్గుమాలిన రాజకీయాలు మానుకోకపోతే హితవుపలికారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మరోసారి గట్టి గుణపాఠం చెప్పేందుకు గ్రామప్రజలంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన గుడాల గోపి


భీమవరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి, ఎస్పీ వి.అజితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న గోపి

పాలకొల్లు అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లాను ప్రగతిపథంలో నడిపించేందుకు ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. భీమవరంలో బుధవారం ఆయన ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వి.అజితలను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, అభినందించారు.

ఘనంగా సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ


సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో పార్వతీ సోమేశ్వరస్వామివారి నూతన ఆలయ, పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి ప్రపత్తులతో మెలిగేందుకు దైవ ఆరధన దోహదపడుతుందని, ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గా ప్రసాద్ శర్మ, మంచిలి పురుషోత్తమశర్మల నేతృత్వంలో శాస్త్రోక్తంగా వేద ఆగమ పండితుల సహచర్యంతో నిర్వహించారు. పార్వతీ సోమేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, గ్రామ సర్పంచ్ గుబ్బల యమున భానుమూర్తి, ఎంపీటీసీ సంగాని దుర్గా భవాని, ఆలయ కార్యనిర్వాహణాధికారి పులగం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో మానవాళికి మేలు


పోడూరు : పండితవిల్లూరు హైస్కూల్లో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు


పాలకొల్లు సెంట్రల్ : సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమణారావు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి రంగంలో వెలువడుతున్న నూతన ఆవిష్కరణల వల్ల మానవాళికి ఎంతో ఉపయుక్తంగా ఉంటున్నాయని వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మార్టేలు శాస్త్రవేత్త పి.వెంకట రమణారావు అన్నారు. బుధవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణారావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలపడానికి మన శాస్త్రవేత్తలు నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. మానవాళి ఆకలి తీర్చే విధంగా వ్యవసాయ రంగంలో జరిగే ఆవిష్కరణలను విద్యార్థినులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, అధ్యాపకులు రమణ, మణిమాల, నోబుల్ రాజ్, డాక్టర్ రూప్‌సింగ్, విజయలక్ష్మి, మమత, శైలజలు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానంతోనే అభివృద్ధి

పెనుగొండ: సాంకేతిక విజ్ఞానంతోనే ప్రపంచం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డే నిర్వహించారు. సముద్రపు నీరు నీలం రంగులో ఎందుకు ఉంటుందో అధ్యాయనం చేసిన కనిపెట్టిన మహనీయుడు సర్ సీవీ రామన్ అని కొనియాడారు. రామన్ ఎఫెక్ట్ ప్రపంచానికి మార్గదర్శినిగా నిలిచిందని చెప్పారు. మానవునిలో ఉన్న అవయవాలను రంగుల రూపంలో విద్యార్థులు బొమ్మలు వేసి ప్రదర్శించి ఆకట్టుకొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఎంపీటీసీ ఎల్లమెల్లి బేబీరాజేష్, స్కూల్ చైర్మన్ బొరుసు రాంబాబు, ఉపాధ్యాయులు బి.వెంకట కృష్ణ, బి.శ్రీనివాస్, కేవీఆర్‌ఎల్ స్వామి, రమణారావు, పి.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పండిత విల్లూరు జెడ్పీహైస్కూల్లో..

పోడూరు: పండిత విల్లూరు జెడ్పీహైస్కూల్లో సైన్స్‌డేను హెచ్‌ఎం వీరవల్లి సత్యప్రియరాం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ పరికరాలను, సైన్స్ అంశాలతో కూడిన నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యప్రియరాం మాట్లాడుతూ సైన్స్ శాస్త్రవేత్త సీవీ రామన్ భారత దేశానికే గర్వకారణమన్నారు. ఆయన కనిపెట్టిన రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. సీవీ రామన్ జయంతిని జాతీయ సైన్స్‌డేగా నిర్వహించుకుంటున్నట్టు చెప్పారు.


పోడూరు : పండితవిల్లూరు జెడ్పీహైస్కూల్లో విద్యార్థుల నాటిక ప్రదర్శన


పెనుగొండ : కొడమంచిలిలో జాతీయ సైన్స్‌డే

జీర్ణోద్ధారణ ఆలయాలకు టీటీడీ నిధులు


టీటీడీ పాలక మండలి సభ్యుడు శేషుబాబుని సత్కరిస్తున్న సర్పంచ్ కరుణాకర్, పెద్దలు

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో జీర్ణోద్ధారణకు చేరిన ఆలయాల పునఃనిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం సుమారు రూ.10 లక్షల వరకు నిధులు విడుదల చేయనుందని టీటీడీ పాలకమండలి సభ్యుడు మేకా శేషుబాబు చెప్పారు. పాలకొల్లు మండలం దిగమర్రు గ్రామంలో రామాలయం పునఃనిర్మాణానికి టీటీడీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించినందుకు ఆ గ్రామ సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్, గ్రామ పెద్దలు బుధవారం శేషుబాబుని కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల ఖాతాల్లో వడ్డీ, రైతు భరోసా సొమ్ము

యలమంచిలి: మండలంలోని 1,355 మంది రైతులకు వడ్డీ సబ్సిడీ రూ.16,79,982 జమైనట్టు మండల వ్యవసాయాధికారి చింగలూరి దేవి బుధవారం తెలిపారు. 2021-22 రబీ రుణాలకు సంబంధించి 306 మందికి రూ.3,20,856, ఖరీఫ్ 2022 రుణాలకు 1049 మంది రైతులకు రూ.13,59,126 వడ్డీ సబ్సిడీ కింద నగదు వారి బ్యాంకు ఖాతాలో జమైనట్టు చెప్పారు. అదే విధంగా రైతు భరోసా, పీఎం కిసాన్ మూడో విడతకు సంబంధించి 6,732 మంది రైతులకు రూ.1,34,64,000 జమైందన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష, రాబోయే మూడు నెలల్లో చేపట్టాల్సిన పనులపై చర్చిస్తామని పేర్కొన్నారు.

నేడు పునఃప్రతిష్ఠ

యలమంచిలి: స్థానిక మంచినీటి చెరువు గట్టున పునర్నిర్మించిన శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవ పూజలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ భక్తాంజనేయస్వామి, శ్రీ గణపతి విగ్రహ, శిఖర, జీవ ధ్వజ ప్రతిష్ఠ గురువారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రతిష్ఠాపన మహోత్సవాలు


పెనుగొండలో ఉమా సోమేశ్వర స్వామి ఆలయ పున ఃప్రతిష్ఠ మహోత్సవాలు

పెనుగొండ: సుప్రసిద్ధ ఉమాసోమేశ్వర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం బ్రహ్మశ్రీ కేతవరపు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఉమాసోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, యంత్ర జపం, లక్ష్మీ గణపతి, అష్టలక్ష్మి, మహాసుదర్శన హోమాలు నిర్వహించి, నీరాజన మంత్ర పుష్పార్చన చేశారు.

నేడు పునః ప్రతిష్ఠ : గురువారం ఉదయం ఉమాసోమేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తమ నంపూడి వెంకట సత్యనారాయణ రెడ్డి, వెంకట సుబ్రహ్మణేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాలలో మార్చి 1 నుంచి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తెలిపారు. పరీక్షలు జరిగే రూమ్స్‌లో అన్ని వసతులు కల్పించినట్టు చెప్పారు.